క్లుప్తంగా

హౌసింగ్ బోర్డు కాలనీలో చోరీ



ఇంట్లో చిందరవందరగా ఉన్న వస్తువులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. 1వ పట్టణ పోలీసుల కథనం.. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉండే ఓ కుటుంబం సొంత పనులపై వేరే ఊరికి వెళ్లారు. సోమవారం అర్ధరాత్రి దొంగలు ఇంట్లో ఎవరూ లేరని తెలుసుకుని చొరబడ్డారు. ఇంట్లో విలువైన పట్టుచీరలు, రూ.20 వేల నగదు దోచుకెళ్లారు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన మహిళ మృతి



మృతి చెందిన తులసమ్మ

చంద్రగిరి: ప్రమాదంలో గాయపడిన మహిళా భక్తురాలు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సోమవారం తెల్లవారుజామున నరసింగాపురం సమీపంలోని నారాయణ కళాశాల వద్ద కాలినడకన తిరుమలకు వస్తున్న భక్తులను 108 అంబులెన్స్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మహిళా భక్తులు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో అన్నమయ్య జిల్లా, రామసముద్రం మండలం, చింపరపల్లికి చెందిన తులసమ్మ(43) పరిస్థితి విషమంగా ఉండడంతో బంధువులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే తిరిగి ఆమెను తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించారు. 108 అంబులెన్స్ ఢీకొన్న ప్రమాదంలో మృతుల సంఖ్య ముగ్గురికి చేరింది.

జూద స్థావరాలపై దాడులు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : రేణిగుంట అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జూద స్థావరాలపై పోలీసులు మెరుపు దాడులు నిర్వహించి అయిదుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు... రేణిగుంట మండలం చెంగారెడ్డిపల్లి, రేణిగుంట బుగ్గ వీధిలో జూదం ఆడుతున్నారన్న సమాచారంతో మంగళవారం సాయంత్రం రేణిగుంట అర్బన్ ఎస్ఐ అరుణ్ కుమార్‌రెడ్డి సిబ్బందితో మెరుపు దాడులు నిర్వహించి అయిదుగురిని అదుపులోకి తీసుకొని రెండు వేర్వేరు కేసులు నమోదు చేసి 15 వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

బాల్యవివాహాలు నేరం

బుచ్చినాయుడుకండ్రిగ : బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, ప్రోత్సహించిన, చేసినా జైలు తప్పదని ఎస్ఐ విశ్వనాథనాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కిశోర వికాసం మండల స్థాయి శిక్షకుల శిక్షణ కార్యక్రమం జరిగింది. బాల్య వివాహాలను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని కోరారు. సీడీపీఓ దేవకుమారి బాల్యవివాహాల వలన కలిగే అనర్థాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, ఎంఈఓ మునిసుబ్రహ్మణ్యం, సీహెచ్‌ఓ వెంకటేశులు, ఏపీఎం మునెయ్య, ఈఓపీఆర్డీ రాజశేఖర్, సూపర్‌వైజర్ యమున, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పక్షుల పండుగ.. ఏర్పాట్లు మెండుగా!

- నాలుగు చోట్ల పండుగ ఏర్పాట్లు
- సందర్శకులకు ఇబ్బందులు లేకుండా వసతులు

దొరవారిసత్రం: సూళ్లూరుపేట కేంద్రంగా ఈ నెల 18, 19, 20 తేదీల్లో నిర్వహించే ఫ్లెమింగో ఫెస్టివల్ (పక్షుల పండుగ) అట్టహాసంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలియజేశారు. ఆయన స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ఫారెస్ట్, టూరిజం తదితర శాఖల అధికారులతో కలిసి నేలపట్టు పక్షుల కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. మూడు రోజుల పాటు నిర్వహించే పక్షుల పండుగ సమయంలో సందర్శకులు, పర్యాటకుల కోసం వసతులు, సదపాయలు వంటి వాటిపై ఆయా శాఖల అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. పండుగ సమయంలో సూళ్లూరుపేట, నేలపట్టు, పూలికాట్, బీవీ పాళెం ప్రాంతాలను సందర్శించే సందర్శకులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆయా శాఖల అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పక్షుల కేంద్రంలో విడిది చేసే విహంగాలను వీక్షించి ఎంతో ఆనందం వక్తం చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పండుగ ఏర్పాట్లు నాలుగు ప్రాంతాల్లో చేస్తున్నామన్నారు. నిరుపయోగంగా మారిన టూరిజం సముదాయాలు పండుగలోపు వినియోగంలోకి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్టు వెల్లడించారు. శ్రీసిటి సెజ్ ప్రాంతంలోని పరిశ్రమల సహకారంతో పక్షుల సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అవగాహన, వివిధ కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే పండుగలో ఎక్కడ కూడా ప్రవేశ రుసుం చెల్లించాల్సిన పనిలేదన్నారు. సూళ్లూరుపేట, నేలపట్టు ప్రాంతాల్లో పలు ప్రదర్శనలు, స్టాల్స్ తదితరవి ఏర్పాటు చేస్తామన్నారు. ఆయన వెంట సూళ్లూరుపేట డీఎఫ్ఓ హారిక, జిల్లా టూరిజం అధికారి, వైఎస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, తహసీల్దార్ శైలకుమారి, ఎంపీడీఓ గోవర్ధన, ఎఫ్ఆర్ఓ సౌజన్య ఉన్నారు.



పక్షుల కేంద్రంలో విడిది చేస్తున్న విదేశీ విహంగాలు

రైతుల సమస్యపై స్పందించిన కలెక్టర్

నేలపట్టు పక్షుల కేంద్రం పరిధిలోని అత్తిగుంట, నేరేడుగుంట చెరువులకు చెందిన తూములు మరమ్మతులకు గురికావడంతో సాగు నీరు పంట పొలాలుకు చేరడం లేదని ఆయకట్టు రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఆయన తన నిధులు మంజూరు చేస్తానని, ఈపనులు ఎప్పుడు చేస్తారని సంబంధిత ఇరిగేషన్ డీఈ శ్రీధర్‌ని అడిగి వివరాలు తెలుసుకున్నారు. జూన్‌లో తూముల పనులు పూర్తి చేయించి సాగు నీరు పంట పొలాలకు సక్రమంగా అందేలా చూస్తామని కలెక్టర్ రైతులకు హామీ ఇచ్చారు.



పక్షుల కేంద్రంలోని చెరువులకు చెందిన తూముల దుస్థితిని కలెక్టర్‌కు వివరిస్తున్న ఆయకట్టు రైతులు

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాలు కేంద్రాలుగా జరగనున్న పక్షుల పండుగ ఏర్పాట్లపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. ఫ్లెమింగో ఫెసివల్–2025 నిర్వహణ ఏర్పాట్ల సమీక్షలో భాగంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని, దొరవారిసత్రం మండలం నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రాన్ని, తడమండలం భీములవారిపాళెం పడవల రేవును ఆయన ఎమ్మెల్యేతో కలిసి పరిశీలించారు. ముఖ్యంగా ఎగ్జిబిషన్ స్టాల్స్, సాంస్కృతిక కార్యక్రమాల వేదిక, నేలపట్టు చెరువులో పక్షులను వీక్షించడం, అలాగే అటకానితిప్ప పర్యావరణ విజ్ఞానకేంద్రం సందర్శనలతో పాటు తడ మండలం భీములవారిపాళెం పడవల రేవులో పడవ షికార్ లాంటివి ఏర్పాటు చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. వైల్డ్‌లైన్ డీఎఫ్ఓ రాధిక, డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, తహసీల్దార్ నరసింహులు, ఆర్డీఓ కార్యాలయ డీఏఓ రవికుమార్ పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఉత్సాహంగా క్రీడా పోటీలు



చెస్ ఆడుతున్న విద్యార్థులు

తిరుపతి సిటీ: శ్రీ వెంకటేశ్వర పశువైద్య కళాశాల వేదికగా జరుగుతున్న అంతర్ కళాశాలల క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. క్రీడల్లో రెండవ రోజు క్రికెట్, వాలీబాల్, అథ్లెటిక్స్, బాల్ బ్యాడ్మింటన్, చెస్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. పురుషుల 400, 500 మీటర్ల పరుగు పందెంలో గరివిడి విద్యార్థులు విజేతగా నిలిచారు. మహిళా విభాగంలో జావెలింగ్‌త్రోలో గరివిడి విద్యార్థిని, షాట్‌పుట్‌లో ప్రొద్దుటూరుకు చెందిన విద్యార్థిని గెలుపొందారు. వాలీబాల్ మహిళా విభాగంలో డెయిరీ టెక్నాలజీ కళాశాల ప్రొద్దుటూరు విద్యార్థులు గెలుపొందారు. బాస్కెట్‌బాల్ విభాగంలో తిరుపతి విద్యార్థులు ప్రతిభను చాటారు. అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య పాల్గొన్నారు.

కోలుకున్న కార్మికులు

నారాయణవనం: లకీ ఫోర్ యూ హెర్బల్ ఫ్యాక్టరీ ట్రయల్ రన్‌లో శనివారం అర్ధరాత్రి అస్వస్థతకు గురైన కార్మికులు కోలుకున్నారని యాజమాన్యం తెలిపింది. మంగళవారం ఫ్యాక్టరీ ప్రతినిధి మూర్తి మీడియాతో మాట్లాడుతూ అనుకోకుండా ఎక్స్‌ట్రాక్ట్ చాంబర్ నుంచి వ్యర్థాలను బయటకు తీసే వాల్వు రబ్బర్ దారం తెగడంతో ద్వారం తెరుచుకుని పౌడర్ వెదజల్లిందన్నారు. పౌడితో కలిసిన గాలిని పీల్చడంతో అస్వస్థతకు గురైన పది మంది కార్మికులు కోలుకుని ఆరోగ్యంగా ఉన్నారని అన్నారు.

అనారోగ్యమా.. కొట్టి చంపేశాడా?

- అనుమానాస్పద స్థితిలో బాలింత మృతి
- నెలల రోజుల పాపను తీసుకుని పరారైనా భర్త
- కేసు నమోదు చేసిన సూళ్లూరుపేట రైల్వే పోలీసులు



నాగలక్ష్మి మృతదేహం

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారమ్ వద్ద ఓ బాలింత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. సూళ్లూరుపేట రైల్వే పోలీసులు మంగళవారం గుర్తించారు. సూళ్లూరుపేట రైల్వే ఎస్ఐ వై.చెన్నకేశవ, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావులు రైల్వే స్టేషన్‌కు చేరుకుని మహిళ మృతదేహాన్ని పరిశీలించారు. రైల్వే ఎస్ఐ తెలిపిన మేరకు వివరాలు.. నాయుడుపేట పట్టణంలోని తుమ్మూరు ఎస్టీ ఏటిగట్టు కాలనీ వద్ద నివాసముంటున్న నాగలక్ష్మి(27) మొదటి భర్త ఏడేళ్ల కిందట మృతి చెందాడు. పెనిమేటి కృష్ణయ్య అనే అతన్ని రెండో పెళ్లి చేసుకుంది. ఆమెకు మొదటి భర్త సంతానం 8 ఏళ్ల కుమారుడు శ్రీనివాసులు ఉన్నాడు. నాగలక్ష్మి గత నెల 3వ తేదీన పాపకు జన్మనిచ్చింది. బాలింత అయిన నాగలక్ష్మి ఆరోగ్యం సరిలేక పోవడంతో సోమవారం రాత్రి ఆమె ఇద్దరు పిల్లలును తీసుకుని భర్త కృష్ణయ్యతో కలిసి నెల్లూరుకు వెళ్లేందుకు నాయుడుపేట రైల్వే స్టేషన్‌కు వచ్చారు. రాత్రి రైలు లేక పోవడంతో మంగళవారం ఉదయం వెళ్లేందుకు స్టేషన్ వద్దే ఉండిపోయారు. మంగళవారం ఉదయం నాగలక్ష్మి ఆరోగ్యం మరింత క్షీణించి మృతి చెందినట్లుగా రైల్వే పోలీసులు అనుమానిస్తున్నారు. భర్త కృష్ణయ్య రైల్వే పోలీసులు వచ్చేటప్పటికే మృతురాలి పాపను తీసుకుని పరారయ్యాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నాగలక్ష్మి మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలి భర్త కృష్ణయ్య కోసం రైల్వే పోలీసులు గాలిస్తున్నారు. ఇదిలా ఉండగా నాగలక్ష్మి ఆరోగ్యంగానే ఉందని, భర్త మద్యం సేవించి తరచూ వేధింపులకు గురిచేసేవాడని కాలనీ వాసులు ఆరోపించారు. భర్త కృష్ణయ్య నాగలక్ష్మిని రైల్వే స్టేషన్ వద్ద చంపేసి ఉంటాడని చెబుతున్నారు. ఈ మేరకు పోలీసలు విచారణ చేపట్టారు. ఇదిలావుండగా మృతురాలి కుమారుడు శ్రీనివాసులును ఐసీడీఎస్ సీపీడీఓ ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో సూపర్ వైజర్ ఆశాబేగం గూడూరు బాలసదన్ శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు.

రక్తమోడిన జాతీయ రహదారి

- రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



ప్రమాద స్థలంలో విలపిస్తున్న పవన్‌కుమార్ తల్లిదండ్రులు, భార్య.

కలువాయి: 565 జాతీయ రహదారి రక్తమోడింది. కలువాయి మండలంలో రెండు వేర్వేరు చోట్ల జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. కలువాయి పోలీసుల కథనం.. ఉయ్యాలపల్లి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అనంతసాగరం మండలం, లింగంగుంటకు చెందిన చీలిపోగు పవన్‌కుమార్ అలియాస్ చిన్న(25) మృతి చెందాడు. ఇతని దేహం రెండు ముక్కలై, తల పగిలిపోయి, పేగులు బయటపడ్డాయి. వెంకటరెడ్డిపల్లి పెన్నా వంతెన సమీపంలో కారు ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న మల్లికా చెన్నకేశవులు(53) తీవ్రంగా గాయపడ్డాడు. 108 వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఇతని స్వగ్రామం రాపూరు మండలం ఆకిలవలస.

అత్తగారింటికి వచ్చి మృత్యువాత

ఉయ్యాలపల్లి సమీపంలో జరిగిన ప్రమాదంతో మృతి చెందిన చీలిపోగు పవన్‌కుమార్‌ది అనంతసాగరం మండలం, లింగంగుంట గ్రామం. సోమవారం రాత్రి తన అత్తగారి ఊరైన ఉయ్యాలపల్లికి తన తల్లిదండ్రులతో కలిసి వచ్చాడు. మద్యం సేవించి భార్య నందినితో గొడవపడి ఇంట్లో వాళ్లు వద్దని వారిస్తున్నా వినకుండా రాత్రి పది గంటల ప్రాంతంలో అత్త దగ్గరకు వెళ్లి నాన్న అనారోగ్యం గురించి చెప్పి డబ్బు తీసుకువస్తానని వెళ్లాడు. ఉదయం రోడ్డుపై శవమై కనిపించడంతో పవన్‌కుమార్ భార్య నందిని, తల్లిదండ్రులు పెంచలమ్మ, రామయ్య బోరున విలపించారు. మద్యం మత్తులో రోడ్డుపైనే పడిపోవడంతో గుర్తుతెలియని వాహనం తొక్కుకుని వెళ్లి ఉంటుందని చెపుతున్నారు.

తోటకు తిరిగివస్తూ..

వెంకటరెడ్డిపల్లి పెన్నా వంతెన వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందిన మల్లికా చెన్నకేశవులు స్వగ్రామం రాపూరు మండలం, ఆకలివలస. ఇతను అనంతసాగరం మండలం, ఉప్పలపాడు సమీపంలోని ఓ తోటలో కాపలాదారుగా పనిచేస్తుంటాడు. సోమవారం రాత్రి ఆకలివలసలో ఉన్న తన భార్య వద్దకు వెళ్లి తిరిగి తాను కాపలా ఉండే ఉప్పలపాడు సమీపంలోని తోట వద్దకు బైక్‌పై వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. ఈ రెండు మృత దేహాలను పోస్టుమార్టానికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కలువాయి ఎస్ఐ సుమన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో తమిళ కూలీ మృతి



గాయపడిన తనిగవేలు



ప్రమాదానికి కారణమైన కంటైనర్

నారాయణవనం: కుటుంబ పోషణ కోసం చెరుకు నరకడానికి వచ్చిన తమిళనాడు వాసి రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. మరో కూలీ తీవ్ర గాయాలతో ఆస్పత్రి పాలయ్యాడు. ఈ ఘటన మంగళవారం వేకువ జామున మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం.. తమిళనాడు రాష్ట్రం, విల్లుపురానికి చెందిన కొందరు కూలీలు నైనారుకండ్రిగలో చెరుకు నరికేందుకు వచ్చారు. మంగళవారం వేకువ జామున 5.40 గంటల సమయంలో చెరుకును లోడ్ చేయడానికి హైవేలో బస్ షెల్టర్ వద్ద వేచి ఉన్నారు. చెన్నై నుంచి కడపకు వెళుతున్న కంటైనర్ వీరిపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో విల్లు పురానికి చెందిన రాజేంద్రన్(45) మృతి చెందగా, మరో కూలీ తనిగవేలు(45) తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన తనిగవేలును చికిత్స నిమిత్తం పుత్తూరు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ప్రమాదానికి కారణమైన డ్రైవర్ శివగండన్‌ను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో గంజాయి స్మగ్లర్లు

చిల్లకూరు: గంజాయిని అక్రమంగా కారులో తరలిస్తున్నారనే సమాచారంతో తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసులు బూదనం టోల్ గేట్ వద్ద మంగళవారం మాటు వేశారు. స్మగ్లర్లకు ముందుగానే సమాచారం అందడంతో వారు గూడూరు వైపు వెళ్లిపోగా.. గూడూరు పోలీసులు పోటుపాళెం సర్కిల్ వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే గంజాయి ఉన్న కారులోని ఇద్దరు వ్యక్తులు వేగంగా కోట వైపు పరారు కావడంతో వారిని విద్యానగర్ ప్రాంతంలో చేజ్ చేసి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్మగ్లర్లను నాయుడుపేటకు తరలించి విచారణ చేస్తున్నట్లు తెలిసింది. వీరి వద్ద నుంచి సుమారు 78 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.

వైకుంఠ ఏకాదశికి ప్రత్యేక చర్యలు



సమావేశంలో పలు సూచనలు చేస్తున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి అర్బన్: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఈ నెల 10 నుంచి 19 వరకు ఇవ్వనున్న దర్శనం టిక్కెట్ల విషయంలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. ఆ మేరకు కలెక్టరేట్‌లో ఆయన మంగళవారం అధికారులతో సమావేశమయ్యారు. డీఆర్వో మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం తిరుపతిలోని జీవకోన, ముత్యాలరెడ్డి పల్లి జెడ్పీ హైస్కూళ్లు, రామచంద్ర పుష్కరిణి, రామానాయుడు హైస్కూల్, ఇందిరా మైదానం, శ్రీనివాస కాంప్లెక్స్, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్, బాలాజీ కమ్యూనిటీ హాల్, తిరుమల మొత్తం 9 సెంటర్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కేంద్రాల పర్యవేక్షణకు జిల్లాలోని తొమ్మిది మంది తహసీల్దార్లను నియమించినట్లు చెప్పారు. భక్తులకు సులభతరంగా ఇబ్బందులకు గురి కాకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. గ్రీవెన్స్ అర్జీలను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోస్మాండ్ పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

దారిలేని దళితులు!



స్తంభించిన అరుంధతివాడ కాలువ

శ్రీకాళహస్తి : పట్టణంలోని కాగితాల అరుంధతివాడకు మెగా కంపెనీ పుణ్యమా అని దళితులకు దారిలేకుండా పోయింది. గతంలో మెయిన్ రోడ్డుకు ఉన్న దారి రోడ్డు విస్తరణలో భాగంగా దారి లేకుండా చేశారు. మెగా కంపెనీ వారిని ప్రశ్నిస్తే పని అయిన తరువాత దారి ఏర్పాటు చేస్తామని చెబుతున్నారని స్థానికులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం అరుంధతివాడ వద్ద నిరసనకు దిగారు. మూడు నెలలుగా అదిగో చేస్తాం.. ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దారి ఏర్పాటు చేయకపోతే రోడ్డు మీదే కూర్చుంటామని హెచ్చరించారు.



నిరసన తెలుపుతున్న ప్రజలు

రాయలసీమకు బీజేపీ ద్రోహం

సత్యవేడు : కడప ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయకుండా రాయలసీమ ప్రజలకు బీజేపీ ద్రోహం చేసిందని సీపీఎం మండల కార్యదర్శి రమేష్ ఆరోపించారు. విశాఖలో ప్రధాని పర్యటనను నిరసిస్తూ మంగళవారం సత్యవేడులో సీపీఎం నాయకులు నిరసన చేపట్టారు. విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకునేందుకు రెండేళ్లుగా కార్మికులు పోరాడుతుండగా విశాఖకు ప్రధాని రావడం ఆంధ్రులను అగౌరవ పరచడమేనన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.మునిరాజా, తిరుమలరెడ్డి, పోలమ్మ, లక్ష్మి, మునస్వామి, కృష్ణయ్య పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : రాష్ట్రానికి ద్రోహం చేసి విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీకి రెడ్ కార్పొరేట్ పరిచిన బాబు–పవన్‌కు సిగ్గులేదా అంటూ సీపీఎం నాయకులు ప్రశ్నించారు. ప్రధాని మోదీ 8వ తేదీన విశాఖ పర్యటనను నిరసిస్తూ మంగళవారం రేణిగుంట అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం మండల పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో రేణిగుంట–ఏర్పేడు మండలాల ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కె. హరినాథ్, సీపీఐ నాయకులు మురళి, సెల్వరాజ్, సత్య శ్రీ,ఈశ్వరమ్మ, కృష్ణ, రాజశేఖర్, పద్మమ్మ, కరీముల్లా, వెంకటరమణ, దిలీప్ భాషా పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి : రాష్ట్రంలో అడుగుపెట్టే అర్హత ప్రధాని మోదీకి లేదని సీపీఎం నాయకులు ఆరోపించారు. పట్టణంలోని అంబేడ్కర్ కూడలి వద్ద నిరసన తెలిపారు. ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి మాట్లాడుతూ.. మిట్టల్ స్టీల్ పరిశ్రమకు చేయూతనివ్వడం సిగ్గుచేటన్నారు. పుల్లయ్య, గురవయ్య, కుమార్, రాధమ్మ, వెంకటేష్, లాల్‌బాషా పాల్గొన్నారు.

విద్యార్థినులకు ప్రశంస



విద్యార్థినులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న మునిసుబ్రహ్మణ్యం

బుచ్చినాయుడు కండ్రిగ : జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చరిత, హారికను మంగళవారం ఎంఈఓ మునిసుబ్రహ్మణ్యం, ప్రధానోధ్యాయుడు రమణయ్య అభినందించారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న వీరు రైన్ వాటర్ హార్వెస్ట్ ఇన్ రోడ్ సేఫ్టీ ప్రాజెక్ట్ గ్రూపు విభాగంలో విద్యార్థులు తృతీయ స్థానం సాధించారని తెలిపారు.

సస్యరక్షణతో దిగుబడులు



మాట్లాడుతున్న సౌజన్య

నారాయణవనం : యాజమాన్య, సస్యరక్షణ పద్ధతులతో మామిడిలో అధిక దిగుబడిని సాధించవచ్చునని వ్యవసాయశాఖ ఏడీ రమేష్, ఉద్యానవన అధికారి సౌజన్య తెలిపారు. మంగళవారం మండలంలోని అరణ్యకండ్రిగ రైతు సేవా కేంద్రంలో మామిడి సాగుపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. పూత దశలో ఎక్కువగా ఆశించే తేనె మంచు పురుగు నివారణకు 1.5 మిల్లీ క్లోరి పైరిపాస్‌ను 1 మిల్లీ ఇమిడాక్లోప్రిడ్‌ను వేరువేరుగా లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. అవగాహన సదస్సులో మండల హార్టికల్చర్ అసిస్టెంట్ నరేష్, మామిడి రైతులు పాల్గొన్నారు.

భక్తుల భద్రతకు ప్రాధాన్యం

తిరుమల : శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్ తెలిపారు. మంగళవారం తిరుమల ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు, కండక్టర్లతో సమావేశం నిర్వహించారు. కొండకు నిత్యం లక్షలాది మంది భక్తులు రాకపోకలు సాగిస్తుంటారని, వారిని గమ్యస్థానానికి చేర్చాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఘాట్‌రోడ్‌లో ప్రయాణించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని పెద్దసంఖ్యలో బస్సులు నడుస్తాయని, ఆ మేరకు సిబ్బంది జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు.





రంగులు అద్దుతున్న మహిళ



కలంకారీ చిత్రం

శ్రీ కళల హస్తి

- ఆధ్యాత్మికతకు నెలవు
- కలంకారీకి ప్రసిద్ధి
- కోవా కేక
- విస్తరిస్తున్న వ్యాపార రంగం

శ్రీకాళహస్తి : తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి ఆధ్యాత్మిక, పర్యాటకంగా అభివృద్ధి చెందుతోంది. జిల్లాలో ముఖ్యమైన పెద్ద పట్టణం శ్రీకాళహస్తి. స్వర్ణముఖి నదీ తీరంలో తూర్పు, పడమరలుగా విస్తరించింది. పట్టణం మధ్యలో నది ప్రవహించే ప్రముఖ పుణ్యక్షేత్రం. పంచ లింగాల్లో ముఖ్యమైన వాయులింగం శ్రీకాళహస్తిలో ఉండడం విశేషం. శ్రీ–కాళ–హస్తి (సాలె పురుగు, పాము, ఏనుగు) తమ భక్తి త్యాగాలకు చిహ్నంగా శ్రీకాళహస్తిగా రూపుదిద్దుకుంది. ఆలయంలో శివుడి తలపై అయిదు తలల పాము రాహువు, ఒక తల కేతువు జ్ఞానప్రసూనాంబ అమ్మవారి వడ్డానంలో ఉండటం వల్ల ఈ ఆలయం రాహు కేతు పూజలకు నిలయమైంది.

పట్టణ చరిత్ర



మూడో శతాబ్దంతోనే శ్రీకాళహస్తీశ్వరాలయం గురించి తమిళ తంగం వంశానికి చెందిన నక్కీరన్ అనే తమిళకవి తన రచనల్లో పేర్కొనడం జరిగింది. అలాగే 5వ శతాబ్దంలో ఆలయం నిర్మించినట్లుగా ఆధారాలున్నాయి. 11వ శతాబ్దంలో రాజేంద్ర చోళుడు వంశం రాజులు విజయనగరం రాజుల చేత ఆలయం నిర్మించినట్లు చెబుతారు. గజపతులపై విజయం సాధించిన తరువాత శ్రీకాళహస్తికి విచ్చేసిన శ్రీకృష్ణదేవరాయలు 1516లో విజయ చిహ్నంగా రాజగోపురం నిర్మించారు.

గ్రేడ్1 మున్సిపాలిటీ

శ్రీకాళహస్తి మొదటి గ్రేడ్ పురపాలకంగా విస్తరించింది. 24.5 చదరపు కిలోమీటర్ల మేర పట్టణం విస్తరించి ఉంది. 17 రెవెన్యూ వార్డులు, 35 ఎన్నికల వార్డులుగా 150 పడకల ఆస్పత్రి, మూడు అర్బన్ హెల్త్ సెంటర్లు, కూరగాయల మార్కెట్, 21 ప్రాథమిక పాఠశాలలు, 6 ఉన్నత పాఠశాలలు, రెండు జడ్పీ ఉన్నత పాఠశాలలు, ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలుర , బాలికల డిగ్రీ కళాశాలలు, రెండు బాలికల, బాలుర జూనియర్ కళాశాలలు, ఉన్నాయి. జనాభా పట్టణంలో సుమారు లక్షకు పైగా జనాభా ఉంది. 62,687 మంది ఓటర్లు ఉండగా 30,204 మంది పురుషులు, 32,477 మంది మహిళలు, ఆరుగురు ఇతర ఓటర్లగా ఉన్నారు. రోజురోజుకు పట్టణం విస్తరిస్తోంది.

పాలకోవా ఫేమస్

తిరుపతి జిల్లాలో అత్యధిక పాడి పరిశ్రమ ఉన్న ప్రాంతం శ్రీకాళహస్తిగా చెప్పుకోవచ్చు. పాల ద్వారా కోఆపరేటివ్ పాల సొసైటీని ఏర్పాటు చేసి ప్రజావసరాలకుపోను మిగిలిన పాలను కోవాగా తయారు చేసి అమ్మకాలు ప్రారంభించారు. అయితే దినదినాభివృద్ధిగా శ్రీకాళహిస్తి కోవాకు ప్రత్యేకమైన స్థానం లభించింది. ముఖ్యమంత్రులైన ఎన్టీఆర్, జయలలిత వంటి వారు శ్రీకాళహస్తి పాలకోవ ప్రియులని అప్పట్లో కథనాలు వచ్చాయి. ఈ మధ్య పుష్ప–1 సినిమాలో శ్రీకాళహస్తి పాలకోవ ప్రాధాన్యం తెలిపే విధంగా కొన్ని సీన్లు పెట్టడం విశేషం.



కలంకారీ

ప్రపంచ ప్రఖ్యాతి కలంకారీ కళ పుట్టినిల్లుగా శ్రీకాళహస్తిని పేర్కొంటారు. పురాతన హరప్ప నాగరికతలోని కలంకారీ కళ ఉన్నట్లుగా ఆధారాలు ఉన్నాయి. అలెగ్జాండర్ వంటి చక్రవర్తులు ఈ కలంకారీ వస్త్రాలను వాడినట్లు చరిత్ర చెబుతోంది. శ్రీకృష్ణ దేవరాయలు ఈ కళలను ప్రోత్సహించినట్లుగా 150 కుటుంబాలు ఈ కలంకారీ కళపై ఆధారపడి జీవిస్తున్నాయి. అందుకు అనుసంధానంగా 2 వేల మంది ఈ కళ ద్వారా ప్రత్యక్షంగా పరోక్షంగా ఆదాయం పొందుతున్నారు. ఇందుకు సంబంధించి జొన్నలగడ్డ గుర్రప్పశెట్టి పద్మశ్రీ అవార్డు పొందారు. అలాగే అనేక అవార్డులను సైతం ఈ కళకు కళాకారులు సాధించారు. వస్త్రాల మీద రామాయణం, మహాభారతం, భాగవతం, మహాభారతాలతో అప్పట్లో చిత్రీకరించిన వారు ట్రెండ్‌కు అనుగుణంగా చీరలు, రవికెలు, చున్నీలు, డ్రెస్ మీద కలంకారీ చిత్రీకరిస్తున్నారు. కలంకారీ కొన్ని ప్రాంతాల్లో ఉన్నప్పటికీ చేతితో రాసే కళాకారులు శ్రీకాళహస్తికే పరిమితమయ్యారు. అందుకే శ్రీకాళహస్తి కలంకారీ ఎంతో ప్రసిద్ధిగాంచింది.



స్వర్ణముఖి నది తీరాన జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయం